AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

28-10-2026 (Wednesday)

MAIN EDITION

ట్రీటెడ్ వాటర్‌పై సీఎం సమీక్ష



అక్షరటుడే, హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో ఎస్టీపీలు, ట్రీటెడ్ వాటర్‌పై సీఎం రేవంత్ రెడ్డి బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. నీటి శుద్ధి ప్లాంట్లలో ఏఐ టెక్నాలజీ వినియోగించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో 100 శాతం ట్రీటెడ్ వాటర్ వినియోగించాలన్నారు. రైల్వే, మెట్రోను ట్రీటెడ్ వాటర్ పరిధిలోకి తేవాలని ఆదేశించారు.

ప్రధాని మోదీ, అమిత్ షాలపై రాహుల్ గాంధీ ఆరోపణలు



అక్షరటుడే, ఢిల్లీ : టాటా ట్రస్ట్స్, టాటా సన్స్ లార్డ్స్ బోర్డుల మధ్య ఛైర్మన్ నియామకం, కంపెనీ నిర్ణయాలపై వివాదం ముదురుతున్న రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. టాటా గ్రూప్‌ను ఉద్దేశపూర్వకంగా దెబ్బతీస్తున్నారని ఆరోపిస్తూ ఆయన సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించారు. భారతీయ వ్యాపార రంగం ప్రధాని మోదీ, అమిత్ షాల ఆటవస్తువు కాదని రాహుల్ గాంధీ ఘాటుగా వ్యాఖ్యానించారు.

సౌండ్‌తో మంటలను ఆర్పే వార్టెక్స్ టెక్



అక్షరటుడే, ఫీచర్స్‌డెస్క్: నీరు, ఎలాంటి రసాయనాలు అవసరం లేకుండా, సౌండ్‌తోనే మంటలను ఆర్పే వినూత్న పరికరాన్ని మెక్సికోలోని తమావులిపాస్‌కు చెందిన ఆంజెలా కలీమ్ హెర్నాండెజ్ వెనెగాస్ తయారు చేసింది. ఈ పరికరం నుంచి ధ్వని తరంగాలతో మంటలను ఆర్పి వేయొచ్చు.

కన్నీళ్లు పెట్టుకున్న ముఖేష్ అంబానీ



అక్షరటుడే, ముంబై: రిలయన్స్ జియో ప్లాట్‌ఫామ్స్ స్టాక్ మార్కెట్ అరంగేట్ర వేడుక ముంబైలోని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ వేదికగా అట్టహాసంగా జరిగింది. ఈ సమయంలో వేదికపై తన పిల్లల ప్రసంగాలు వింటూ రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ ఆనందబాష్పాలు రాల్చారు.

32 వేల మంది సిబ్బందితో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్



అక్షరటుడే, ఏపీ : ఆంధ్రప్రదేశ్ తీరాన్ని వణికిస్తున్న 'అర్నబ్' తుఫాన్ తీవ్రత, క్షేత్రస్థాయి పరిస్థితులు, సహాయక చర్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టి సారించారు. కలెక్టర్ల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు దాదాపు 32 వేల మంది అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీ

అక్షరటుడే, హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం హెచ్ఎండీఏ స్పెషల్ చీఫ్ సెక్రెటరీగా ఉన్న జయేష్ రంజన్‌ను పర్యావరణం, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖల స్పెషల్ చీఫ్ సెక్రెటరీగా బదిలీ చేశారు. వికాస్ రాజ్‌ను రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి నుంచి ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీగా బదిలీ చేశారు. నవీన్ మిట్టల్‌ను రోడ్లు భవనాలు, రెవెన్యూ శాఖల స్పెషల్ చీఫ్ సెక్రెటరీగా నియమించారు.



రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన : కేటీఆర్

అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రభుత్వం బుధవారం మూసీ ప్రక్షాళన కోసం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది. అయితే దీనికి వెళ్లేందుకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆమె కుమారుడు కార్తీక్‌రెడ్డి యత్నించారు. వారిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. దీనిపై కేటీఆర్ ఎక్స్‌వేదికగా స్పందించారు. ఇందిరమ్మ పాలన అంటే ఆనాటి ఎమర్జెన్సీ రోజులే అని మరోసారి సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేశారన్నారు.

అర్నబ్ బీభత్సం



- తీరం దాటిన తుపాన్
- పంటలకు తీవ్ర నష్టం
- ఏపీలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

తీరం దాటిన అనంతరం అర్నబ్ తుపాన్ తీవ్రత కొంత తగ్గి సాధారణ తీవ్ర తుపాన్‌గా మారినప్పటికీ, దీని ప్రభావం ఇంకా వీడలేదు. కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర, రాయలసీమలోని పలు జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా భారీ నుంచి కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. తుపాను ధాటికి పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రాబోయే 24 గంటల పాటు రాష్ట్రంలో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. వాగులు, వంకలు ఉప్పొంగే ప్రమాదం ఉందని, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే అవకాశం ఉందని ప్రభుత్వం హెచ్చరించింది.

అధికారుల హెచ్చరికలు..

ఇప్పటికే ప్రమాదకర తీర ప్రాంతాలు, లోతట్టు గ్రామాల ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాల్లోని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఎమర్జెన్సీ రెస్క్యూ పనుల కోసం ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్నాయి. అనవసరంగా ఇళ్ల నుంచి బయటకు రావద్దని, ఉప్పొంగే వాగులు, కాలువలు దాటే సాహసాలు చేయవద్దని అధికారులు స్పష్టం చేశారు. అలాగే, సహాయం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

రైతులకు నష్టం

తుపాన్ దెబ్బకు పంటలకు భారీ నష్టం వాటిల్లింది. కోనసీమ జిల్లాలోని రామచంద్రపురం, కె. గంగవరం, కాజులూరు మండలాల్లో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. విజయనగరం జిల్లాలో అత్యధికంగా వర్షపాతం నమోదు అయింది. వరిపంట, అరటి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్నబ్' తుపాన్ ఎట్టకేలకు తీరాన్ని దాటింది. యానం - నరసాపురం ప్రాంతాల మధ్య ల్యాండ్‌ఫాల్ ప్రక్రియ పూర్తయినట్లు భారత వాతావరణ శాఖ, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ అధికారికంగా ధ్రువీకరించాయి. తీరం దాటే సమయంలో గంటకు 125 నుండి 135 కిలోమీటర్ల వేగంతో భీకర గాలులు వీచగా, గరిష్టంగా గాలి వేగం 150 కిలోమీటర్ల వరకు చేరి తీరప్రాంత జిల్లాలను అతలాకుతలం చేసింది.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు



అక్షరటుడే, ఢిల్లీ : కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. కంటైనర్ తయారీ ప్రమోషన్ స్కీమ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రూ.10 వేల కోట్లతో పథకానికి ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద కొత్త కంటైనర్ తయారీ ప్లాంట్ల ఏర్పాటుకు మూలధన సహాయం, ఇప్పటికే ఉన్న సౌకర్యాల విస్తరణకు ఆర్థిక మద్దతు అందిస్తారు. మౌలిక సదుపాయాల పరీక్ష, నైపుణ్యాభివృద్ధికి కూడా ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారు.

రైల్వే నిలయం ఎదుట కాంగ్రెస్ నాయకుల ధర్నా



అక్షరటుడే, సికింద్రాబాద్ : సికింద్రాబాద్ రైల్వే నిలయం ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు, నాయకులు ధర్నాలో పాల్గొన్నారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ర్యాలీ తలపెట్టిన విషయం తెలిసిందే. ఈ ర్యాలీ కోసం తెలంగాణ నుంచి వెళ్లడానికి ప్రత్యేక రైళ్లు నడపాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. రైల్వే శాఖ రైళ్లు నడపడం లేదని ఆరోపిస్తూ.. బుధవారం ఉదయం భారీ ధర్నా నిర్వహించారు. నిరసనకు మోదీ అడ్డుకుంటున్నారని నినాదాలు చేశారు. కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు.

పారా అథ్లెట్ నీరజ్ యాదవ్ ఆత్మహత్య

అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ : ప్రముఖ పారా అథ్లెట్ నీరజ్ యాదవ్ ఆత్మహత్య చేసుకున్నారు. మూడుసార్లు ఆసియా పారా గేమ్స్ గోల్డ్ మెడలిస్ట్ అయిన ఆయన ఢిల్లీలోని తన నివాసంలో విషం తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన నీరజ్ యాదవ్ 2018లో జకార్తాలో జరిగిన ఆసియా పారా గేమ్స్‌లో జావెలిన్ త్రోలో స్వర్ణం గెలిచాడు. 2023 ఆసియా పారా గేమ్స్‌లో జావెలిన్, డిస్కస్ త్రో ఈవెంట్లలో రెండు స్వర్ణ పతకాలు సాధించాడు. అనంతరం డోపింగ్ టెస్ట్‌లో పట్టుబడటంతో అతడిని తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. దీంతో మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు.



తాగునీరు వృథా.. రూ.5 వేల జరిమానా



అక్షరటుడే, హైదరాబాద్: జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 57లో తాగునీటిని ఇంటి ప్రాంగణం శుభ్రపరిచేందుకు వినియోగిస్తున్నట్లు జలమండలికి ఫిర్యాదు అందింది. దీంతో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తాగునీటి దుర్వినియోగం జరుగుతున్నట్లు గుర్తించి, ఇంటి యజమానికి రూ.5 వేల జరిమానా విధించారు. ఎవరైనా నీటిని వృథా చేస్తే తమకు సమాచారం అందించాలని జలమండలి కోరింది.

పోలీస్ కమిషనర్‌పై వేటు



అక్షరటుడే, కేరళ : కేరళలో జడ్జి కుమారుడు కారుతో ఢీకొట్టడంతో ఓ వ్యక్తి చనిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో తాజాగా పోలీస్ కమిషనర్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. త్రిస్సూర్‌లోని కోర్టు జడ్జి 17 ఏళ్ల కుమారుడు ఇటీవల రాత్రి సమయంలో తన తండ్రికి చెందిన బెంజ్ కారును అతివేగంగా నడుపుతూ ఓ వ్యక్తిని ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలు కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితుడు జడ్జి కుమారుడు కావడంతో పోలీసులు కేసును నీరుగార్చే ప్రయత్నం చేశారు. దీంతో ప్రభుత్వం కొచ్చి పోలీస్ కమిషనర్ కళిరాజ్ మహేష్‌ను సస్పెండ్ చేసింది.

రాత్రివేళ ఫోన్ ఛార్జింగ్‌పై రైల్వే బోర్డు కీలక నిర్ణయం

అక్షరటుడే, నేషనల్ డెస్క్ : రైల్వే బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల మధ్య రైళ్లలోని మొబైల్ ఛార్జింగ్ పాయింట్లను నిలిపి వేయాలని ఆదేశించింది. ఇటీవల ముంబై లోకల్ రైలులో ఛార్జింగ్ చేస్తుండగా ఒక ప్రయాణికుడి పవర్ బ్యాంక్ పేలిపోయింది. కోచ్ మొత్తం దట్టమైన పొగతో నిండిపోయింది. దీంతో రైల్వే బోర్డు రాత్రివేళ ఛార్జింగ్ పాయింట్లు బంద్ చేయాలని ఆదేశించింది.



చరిత్ర సృష్టించిన జియో ప్లాట్‌ఫామ్స్..

అక్షరటుడే, బిజినెస్ డెస్క్: రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ టెలికాం, డిజిటల్ విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ దేశీయ స్టాక్ మార్కెట్లలోకి ఘనంగా అడుగుపెట్టింది. భారీ ఐపీవో అయినా అంచనాలకు అనుగుణంగానే లాభాలను అందించింది. ఈ క్రమంలో పలు రికార్డులను బద్దలు కొట్టింది. లిస్టింగ్‌తోనే దేశంలో రెండో అతిపెద్ద కంపెనీగా ఆవిర్భవించింది. షేరు ఇష్యూ ధర రూ.1,119 కాగా.. బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో రూ.1358 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. ఐపీవో అలాట్ అయినవారికి లిస్టింగ్ సమయంలోనే 21.36శాతం లాభాలు వచ్చాయి.

